కథ

# అమ్మ మనసు

**ఆ సాయంత్రం అబ్బాయి రాబోతున్నాడు అమెరికా నుండి. ముంబయ్ నుండి వచ్చే ఫ్లయిట్ సాయంత్రం నాలుగ్గంటలకి చేర వలసి వుంది. రెండు సంవత్సరాల తర్వాత వాడు వస్తూండడం వలన ఉదయం లేచిన దగ్గర నుండి మా ఆవిడ తెగ హడావిడి పడిపోతోంది!**

వాడి రూమంతా దగ్గరవుండి మరీ శుభ్రం చేయించింది పనిమనిషి చేత. డోర్ కర్టెన్లూ, విండో కర్టెన్లూ మార్చింది. తనే స్వయంగా బజారుకి వెళ్ళి మంచి బొకేలూ, రంగురంగుల పువ్వులూ తీసుకుని వచ్చింది. గదిలో బల్లమీద ఫ్లవర్ వాజ్‌లో రంగు రంగుల పువ్వుల మర్చింది. రంగురంగుల బంతిపూల రేకలు చిదిమి హాలులో గోడకి 'వెల్ కం హోం, డియర్ సన్' అని అంటించింది. వాడి బెడ్‌మీద లైట్ బ్లూ కలర్ బెడ్‌షీట్ వేసి, అదే రంగులో వుండి మధ్యలో పువ్వులున్న గలేబులు తొడిగి దిళ్లు అమర్చింది.

ఇక రాత్రి భోజనం కోసం వంటకాలు సాయంత్రం నాలుగు నుండే ప్రారంభించింది. ఉదయం కాస్త పెరుగు అన్నం మాత్రం ఆ భోజనం అయిపోయిందనిపించింది. అదేమిటంటే ఆకలి లేదంది. ఉదయం లేచిన దగ్గర నుండీ ఆమె చర్యలన్నీ గమనిస్తూనే ఉన్నాను.

"ఏమిటోయ్, వాడు ఈ ఒక్కరాత్రి మాత్రమే ఉండి వెళ్లిపోతున్నట్టు వాడికిష్టమైన వంటకాలన్నీ ఈ రాత్రే చేసేస్తున్నావు?" అన్నాను వంటలో ఆవిడ హడావిడి చూసి.

"చాల్లెండి. వాడికి మీ దిష్టే తగిలేటట్టుంది. రెండు సంవత్సరాల తర్వాత వస్తున్నాడు తెలిసిందా! రెండు స్వీట్లూ, రెండు హాట్లూ చేసేసరికి ఎన్నో చేస్తున్నానంటున్నారు. ఈ వంటకాలు అక్కడ దొరికేనా ఏమిటి?" సున్నితంగా మందలించింది.

"అది కాదోయ్. ఎయిర్ పోర్టుకి నువ్వు కూడా రావచ్చు కదా! వచ్చేటప్పుడు ఏదైనా మంచి హోటల్లో పేక్ చేయించుకుని వచ్చేస్తే సరిపోతుంది కదా" అన్నాను తగులుతూ.

"ఇదిగో, ఇప్పుడే చెప్తున్నాను మీకు- వాడున్న వారం రోజులూ మీరు హోటళ్లూ గీటళ్లూ అంటే ఊరుకోను. ఈ వారం రోజులూ వాడికిష్టమైనవన్నీ నేనే చేసి పెడతాను."

నిజానికి రెండు సంవత్సరాల తర్వాత వాణ్ణి చూడబోతున్నందుకు నాలో కూడా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. బయటపడకుండా నిబ్బరంగా ఉండడానికి ప్రయత్నిస్తూ సతమతమౌతున్నాను. వాడు పుట్టిన దగ్గర నుండీ వాడిని విడిచి ఉండలేదు మేం. మా దగ్గరే ఉండి చదువంతా కొనసాగించాడు. అసలు వాడిని అమెరికా పంపడం తనకిష్టం లేదు. వాడు వెళ్తానంటే నేను తటస్థంగా ఉండిపోయాను. కాని తను మాత్రం వద్దని మొండికేసింది. వాడి ఉత్సాహం చూసి నేనే తనకి నచ్చచెప్పి ఒప్పించాను. వాడితోనే ఇంజనీరింగ్ చదివిన మా ఒదినగారబ్బాయి కూడా వెళ్తూ వుండడం వలన ఒప్పుకుంది.

వాడు అమెరికా వెళ్ళిపోయిన నాడు ఎయిర్ పోర్టులోనే చిన్నపిల్లలా నామీద వాలిపోయి ఏడుస్తున్న తనని ఓదార్చడం చాలా కష్టమైంది నాకు. పదిరోజుల వరకూ మామూలు మనిషి కాలేకపోయింది తర్వాత. వాడి దగ్గర నుండి నాలుగు రోజులకోసారి ఫోను వస్తుంది. ఎప్పుడైనా ఫోను రావడం ఒకటి, రెండు రోజులు ఆలస్యం అయితే చాలు, విలవిల లాడిపోతుంది!

ఆరోజు వాడు వస్తున్నాడని సెలవు పెట్టాను ఆఫీస్‌కి. ఎయిర్‌పోర్టుకి ఫోన్ చేసాను. ముంబయ్ నుండి వచ్చే ఫ్లయిట్ ఒక గంట లేట్‌గా వస్తోందన్నారు. "బస్సులూ, రైళ్లు ట్రాఫిక్ రద్దీ వలనో, ఇంక దేనివలనో సకాలానికి రాకపోవడం చూస్తున్నాం. కాని మేఘాల్లో తేలి వచ్చే విమానాలు లేటేనా?!" అని విసుక్కుంది.

సాయంత్రం నాలుగున్నరకి ఎయిర్‌పోర్టుకి బయలుదేరాను. తను మాత్రం ఇంటిదగ్గరే ఉండిపోయింది ఇంకా చేయవలసినవి చాలా ఉన్నాయని. ఐదు గంటలౌతూండగా ఫ్లయిట్ వచ్చింది. బాల్కనీలో నిలబడి ఫ్లయిట్ దిగుతున్న వాడిని చూసాను. రెండు సంవత్సరాలనంతరం చూస్తూండడం వలన కలిగిన భావోద్వేగంతో కళ్లు చెమ్మగిల్లాయి.

వాడిలో ఎటువంటి మార్పూ లేదు. మరి కాస్త తెల్లబడ్డాడు. నన్ను మీసకట్టు కాస్త దళసరి అయింది. నన్ను చూడగానే నవ్వుతూ రెండు చేతులూ చాచాడు. ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాను.

మరో అరగంటలో ఇల్లు చేరుకున్నాం. ఇక మా ఆవిడ ఆనందం అంతా ఇంతా కాదు. మొదటిసారి అత్తవారింటినుండి పుట్టింటికి వచ్చిన కూతురుని చూసి పొంగిపోయినట్టుంది ఆవిడ వాలకం. వాడిని చూడగానే వాటేసుకుని రెండు చెంపలూ అరిచేతుల్లోకి తీసుకుని నుదుట ముద్దు పెట్టుకుంది. రెండు సంవత్సరాలు దాచిపెట్టుకున్న తల్లిప్రేమనంతా ఆ క్షణంలోనే వాడికి అప్పజెప్పేయాలన్నట్టుంది ఆవిడ తీరు!

అక్కడ వాడు ఉద్యోగం చేసే ప్రదేశం, వసతి, మిత్రులూ- అడిగిన వాటన్నిటికీ ఓపిగ్గా జవాబు చెప్తున్నాడు వాడు. కొంత సేపయ్యాక "నేను స్నానం చేస్తానమ్మా" అంటూ లేచాడు.

స్నానం చేసి వచ్చాక సూట్‌కేస్ తెరచి, "దీనిలోనివన్నీ నీకోసం, నాన్నకోసం" అన్నాడు.

కిచెన్‌వేర్ సామగ్రిని చూస్తూ, "చూడండి, మీకు తట్టలేదుకానీ వాడికి తెలుసు అమ్మకేం కావాలో" అంది నన్నుద్దేశించి.

"అమ్మా, ఈపేకెట్ మా ప్రొఫెసర్ కివ్వాలి. అతను రేపు ఉదయం టూర్ వెళ్లిపోతాట్ట. ఇప్పుడే వెళ్లి ఇచ్చేసి వచ్చేస్తా" మరో పెట్టెలోంచి ఒక చిన్న పేకెట్ తీసి అన్నాడు. అప్పటికి రాత్రి ఎనిమిదైంది.

"వంట చేసేశాను. భోజనం చేసి వెళ్ల కూడదూ?" అంది తను. వచ్చిన గంటలోనే వాడు బయటకు వెళ్తాననడం నచ్చేలేదామెకు.

"అప్పుడే భోజనమేమిటమ్మా? అరగంటలో వచ్చేస్తాగా!" అన్నాడు వాడు.

"సరే. త్వరగా వచ్చేయ్" అయిష్టంగా అంది తను.

నాకుకూడా వాడు ఆ వేళలో వెళ్లడం ఇష్టం లేదు. తను ఉదయం నుండి ఇంచుమించుగా ఏమీ తిననట్టే. ముగ్గురం కలిసి త్వరగా భోజనాలు చేసేద్దామనుకున్నాను.

* * *

రాత్రి తొమ్మిది దాటుతున్నా వాడు రాలేదు. నేను తొమ్మిది గంటలకు టాబ్లెట్ వేసుకోవాలి కనుక వాడికోసం ఎదురు చూసి చూసి తొమ్మిది గంటలకి భోజనం చేసేసాను. తననీ నాతో కూర్చోమంటే ససేమిరా అంది. చేసేది లేక భోజనం చేసేసి టాబ్లెట్ వేసుకుని టీవీ చూస్తూ కూర్చున్నాను. తను ఆకలితో ఉండగా భోజనం చెయ్యడం నాకు కష్టమనిపించింది.

వాడు తెచ్చిన వస్తువులన్నిటినీ జాగ్రత్తగా తీసి, అవేవో అపురూపమైన వస్తువుల్లా చూస్తూ మురిసిపోతోంది తను. నిజానికి అవన్నీ ఇక్కడ దొరికే వస్తువులే! కాకపోతే, అవి 'మేడిన్ అమెరికా!' అంతే!

కొంతసేపయ్యాక, "నువ్వు భోజనం చేసెయ్యకూడదూ. వాడింకా రాలేదు. ఎంతసేపని ఇలా ఎదురు చూస్తూ కూర్చుంటావ్?" అన్నాను.

నాకు నిద్ర ముంచుకొస్తోంది. తను ఒక్కర్తే అయిపోతుందని అంతవరకూ నిద్ర ఆపుకుంటూ వచ్చాను.

నా పరిస్థితి గ్రహించింది తను.

"మీరు నిద్రపొండి. నేను టీవీ చూస్తూ కూర్చుంటాను. వాడొచ్చాక ఇద్దరం కలిసి భోం చేస్తాం" అంది.

మరి మారు మాట్లాడకుండా బెడ్‌రూంలోకి నడిచాను నేను.

* * *

రాత్రి పదకొండు దాటుతుండగా మెలుకువ వచ్చింది నా పక్కనే తను కదలడం వలన.

"అబ్బాయి వచ్చాడా?" అన్నాను గోడగడియారం చూస్తూ.

"ఆ.." అంది. తను అలా అనడంలో ఏదో అపశృతి వుందని గ్రహించాను.

"భోజనాలం చేసారా?" అన్నాను అనుమానంగా.

"వాడు చెయ్యలేదు" ఆవిడ గొంతులో జీర!

ఉలిక్కిపడ్డాను నేను. నిద్ర పూర్తిగా తేలిపోయింది.

"ఏం?" ఆదుర్దాగా అడిగాను.

"వాళ్లు బలవంతం చేసారట! అక్కడ తినేసి వచ్చేసాడు" అంది దుఃఖపడుతూ.

తన వాలకం చూసాక మొదట నవ్వొచ్చింది నాకు. కాని వెంటనే జాలి కలిగింది తన మీద. ఏమిటో ఈ కాలపు పిల్లలు! పూర్తిగా మెకానికల్‌గా తయారౌతున్నారు. ఇల్లూ, తల్లిదండ్రులూ, బంధువులూ, బాంధవ్యాలూ - ఈ సెంటిమెంట్సేమీ వుండడం లేదు.

"ఈ చిన్న విషయానికి నువ్వు ఎందుకు ఇంతగా బాధపడతావ్? వాడికి పెద్దవాళ్లంటే ఎంత గౌరవభావముంటుందో నీకు తెలియని విషయం కాదు. వాడు వెళ్లింది వాళ్ల ప్రొఫెసర్ ఇంటికి. అతడు బలవంతం చేస్తే కాదనలేకపోయుంటాడు. నువ్వు మరీ సెన్సిటివ్ అయిపోతున్నావు. ఇంతకీ నువ్వు భోజనం చేసావా లేదా?" అన్నాను ఓదారుస్తూ.

"తల భారంగా వుంది. పాలు తాగాను. నన్ను నిద్రపోనివ్వండికా" కళ్లు తుడుచుకుని తలవరకూ దుప్పటి లాక్కుంటూ అంది.

నాకు మరి నిద్ర పట్టలేదు. సీలింగ్ ఫాన్ వైపు చూస్తూ వుండిపోయాను.


* * *

అర్ధరాత్రి దాటేక అబ్బాయి మాగదికొచ్చి వాళ్లమ్మని నిద్రలేపడం చూసాను. ఏమీ తెలియనట్టు తల నిండా కప్పుకుని నిద్రపోతున్నట్టు నటించాను.

"అమ్మా ఆకలిగా వుంది" అంటున్నాడు వాడు.

ఉలిక్కిపడి లేచింది తను.

"అన్నీ డైనింగ్ టేబిల్ మీద ఉన్నాయి పద నాన్నా, వడ్డిస్తాను" అంటూ హడావిడిగా మంచం దిగింది.



నేను కాసేపు అలాగే నిద్ర నటిస్తూ పడుకున్నాను.

హాల్లోంచి వాళ్ల మాటలు మెల్లగా, వినిపిస్తున్నాయి.

"రెండు కంచాలున్నాయి. నువ్వు భోజనం చెయ్యలేదా, అమ్మా?" అంటున్నాడు వాడు. "కాస్త తల భారంగా వుంటే పడుకున్నాను. నిద్రపట్టేసింది" అంది తను.

"అలాగా! అయితే నువ్వు కూడా కూర్చో అమ్మా"

అప్పటికి కానీ స్థిమిత పడలేదు నా మనస్సు.

నిద్రలోంచి లేచినట్టు నటిస్తూ డైనింగ్ హాల్లో కొచ్చాను.

"అర్ధరాత్రి పూట ఆరగింపులేమిటీ?" అన్నాను నవ్వుతూ వాళ్లకెదురుగా కూర్చుంటూ.

"అసలే మొహమాటస్తుడు వీడు. అక్కడ సమంగా తిని ఉండడు. ఆకలేస్తోందంటూ వచ్చి లేపాడు. అమ్మ చేసినవి ఇన్ని వంటకాలుండగా ఆకలెయ్యదుమరి?" వాడి పక్కనే కూర్చుని భోం చేస్తూ అంది. ఆవిడ గొంతులో ఎంతో ఉల్లాసం తొణికిసలాడుతోంది.

"చెప్పాను కదుటోయ్! వాడికి పెద్దవాళ్లంటే ఎక్కువ గౌరవమని" వాడిని ఓరకంట చూస్తూ అన్నాను.

"థాంక్యూ నాన్నా" అన్నాడు వాడు.

"ఈ మాత్రానికి నాన్నకి థాంక్స్ చెప్పాలా, ఏమిటి?" అంది తను నావైపు అదోలా చూస్తూ.

అరగంట క్రితం నేను రూంలోకి వెళ్లి వాడిని నిద్రలేపడం, తను వాడి రాక కోసం పడిన ఆరాటం, వంటకాలు చెయ్యడంలో హడావిడీ, బాధతో భోజనం చెయ్యకుండా నిద్రపోవడం, మొదలగు సంఘటనలన్నీ పూసగుచ్చినట్టు చెప్పడం, అంతా విని వాడు ఆత్రంగా లేచి రావడం- ఇవేమీ మా ఆవిడకి తెలియవు మరి.

"ఇంత చల్లటి అమ్మ మనసు నొచ్చుకోనీయకుండా చేసావు. థాంక్యూ నాన్నా" అంటున్నట్టనిపించాయి వాడి చూపులు.

వంటకాలన్నీ ఎంతో బాగున్నాయంటూ మళ్లీ మళ్లీ అడిగి వేయించుకుంటున్న కన్నకొడుకుని చూసుకుంటూ అంతవరకూ పడిన శ్రమనీ, మానసిక వ్యథనీ మరచిపోయింది తను! రుచికరమైన వంటకాలతో పాటు అమృతతుల్యమైన అమ్మ మనసుని ఆస్వాదిస్తూ వుండిపోయాడువాడు. తల్లీ కొడుకుల్ని తృప్తిగా చూసుకుని బెడ్‌రూంలోకి నడిచాను తేలికైన మనసుతో.

యం.యస్.వి.గంగరాజు